సాక్షి కామారెడ్డి

ఆదివారం । 5 । జనవరి । 2025



చలేస్తోంది..

నస్రుల్లాబాద్ గిరిజన బాలుర గురుకుల పాఠశాలను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు.

- 8లో ▸



తీరనున్న కష్టాలు

భిక్కనూరు – తలమడ్ల రోడ్డు వెడల్పు పనులు కొనసాగుతున్నాయి. రాజంపేట వరకు విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.7 /6.8

ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

'సాక్ష్యాధారాల సేకరణ కీలకం'



కామారెడ్డి క్రైం: కేసుల విచారణలో సరైన పద్ధతిలో సాక్ష్యాధారాలను ప్రవేశ పెట్టడమే కీలకమని న్యాయవాదులు పేర్కొన్నారు. ప్రతి నెల మెదటి శనివారం నిర్వహించే సమన్వయ సమావేశంలో భాగంగా కామారెడ్డి కోర్టులో న్యాయవాదులు, కామారెడ్డి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పీఎస్‌ల ఎస్‌హెచ్‌వోలు శనివారం సమావేశమయ్యారు. ఏఎస్పీ చైతన్యరెడ్డి, పీపీలు నిమ్మ దామోదర్‌రెడ్డి, రాజగోపాల్ గౌడ్, ఏపీపీ అశోక్ శివరాం పాల్గొని సబ్ డివిజన్‌లోని పోలీస్ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఆడియో, వీడియో, ఎలక్ట్రానిక్, సైంటిఫిక్ పద్ధతులలో సాక్ష్యాలను సేకరించడం, వాటి ప్రాధాన్యతలపై వివరించారు. ఎస్‌హెచ్‌వోలు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ల మధ్య పరస్పర సహకారం ఉండాలని ఏఎస్పీ సూచించారు. సమావేశంలో సీఐలు చంద్రశేఖర్‌రెడ్డి, రామన్, సంతోష్, ఎస్సైలు, కోర్టు కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

సబ్ జైల్ పరిశీలన



కామారెడ్డి క్రైం: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.నాగరాణి శనివారం కామారెడ్డి సబ్ జైల్‌ను సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలను గురించి తెలుసుకున్నారు. అనంతరం వంట గది, సామగ్రి, ఫిర్యాదుల పెట్టెలను పరిశీలించారు. ఆమె వెంట అసిస్టెంట్ డిప్యూటీ జైలర్ బాదల్ సింగ్, పోలీసు, న్యాయశాఖ సిబ్బంది ఉన్నారు.

కబడ్డీ రాష్ట్ర జట్టుకు ఎంపిక



కామారెడ్డి అర్బన్: జిల్లాకు చెందిన కబడ్డీ క్రీడాకారుడు వంశి జూనియర్ బాలుర కబడ్డీ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రంగ వెంకటేశ్వర్‌గౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాణాల భాస్కర్‌రెడ్డి తెలిపారు. గతనెల 27 నుంచి 30 వరకు జనగామలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో వంశి సత్తా చాటడంతో రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారన్నారు. అతడు ఈనెల 7వ తేదీ నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రంలో నిర్వహించే జాతీయ స్థాయి జూనియర్ బాలుర కబడ్డీ పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు.

జిల్లాస్థాయి సోషల్ ప్రతిభ పరీక్ష



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్కే కళాశాలలో శనివారం జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సోషల్ ప్రతిభ పరీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో రాజు హాజరై, పరీక్ష ప్రశ్నపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ పరీక్షలో ఇంగ్లీష్ మీడియంలో సహస్ర, శ్రీకాంత్‌రెడ్డి, వినూత్న, తెలుగు మీడియంలో రేవతి, ప్రత్యూష, శరణ్య, సొసైటీ, మోడల్ స్కూల్స్‌లో గాయత్రి, పావని, సాయిశివానందరెడ్డి ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని అధికారులు అభినందించి ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఫోరం ప్రతినిధులు ప్రసూన్‌కుమార్, బాలరాజు, రాజశేఖర్‌రావు, కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైంపై సమరం!



మాట్లాడుతున్న సుశీల



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న గడ్డం మల్లేశ్ (ఫైల్)

- అవగాహన కల్పించేందుకు వీడియోలు
- యూట్యూబ్ చానల్‌కు లక్షకుపైగా సబ్‌స్క్రైబర్స్
- ఆదర్శంగా నిలుస్తున్న గడ్డం సుశీల మల్లేశ్ దంపతులు

ఆ దంపతులిద్దరు విద్యాధికులు.. ఒకరు పోలీస్ శాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, మరొకరు గురుకుల కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. తమ వృత్తిలో బిజీగా ఉంటూనే సైబర్ మోసాలపై సమరం సాగిస్తున్నారు. మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు యూట్యూబ్‌ను వేదికగా చేసుకున్నారు. 'క్రైం ఫ్రీ ఇండియా' కోసం వీడియోలు రూపొందించి, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. యూట్యూబ్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని అంధ పిల్లల కోసం ఖర్చు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు సుశీల మల్లేశ్ దంపతులు..

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన గడ్డం మల్లేశ్ హైదరాబాద్‌లోని జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య గడ్డం సుశీల మెదక్ జిల్లా హవేళీ ఘన్‌పూర్ గురుకుల కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఇద్దరు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూనే సైబర్ మోసాలపై సమరం సాగిస్తున్నారు.

సైబర్ మోసాలను చూసి చలించి..

గడ్డం మల్లేశ్ గతంలో సైబర్ క్రైమ్స్ విభాగంలో ఎస్సైగా పనిచేశారు. ఆ సమయంలో సైబర్ మోసాల బారిన పడిన ఎంతో మంది పోలీసులను ఆశ్రయించినపుడు వారి ఆవేదనను చూసి చలించిపోయారు. ప్రజలు మోసాల బారిన పడకుండా ఉండేందుకు ఏం చేయాలన్న అంశంపై విద్యావంతురాలైన తన భార్య సుశీలతో ఈ విషయమై చర్చించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తుంటే, దానికి విరుగుడుగా సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నారు. క్రైం ఫ్రీ ఇండియా పేరుతో యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించారు. ఈ చానల్‌కు మల్లేశ్ భార్య సుశీల సీఈవోగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరూ కూర్చుని ఒక సబ్జెక్టును ఎంచుకుని దానికి ఒక స్క్రిప్ట్ రాసుకుంటారు. దాన్ని మల్లేశ్ వీడియోలు రూపొందించి తమ చానల్‌లో అప్‌లోడ్ చేస్తారు. స్క్రీన్ మీద మల్లేశ్ కనబడుతుండగా.. వెనకాల అంతా సుశీల అన్నీ తానై చూసుకుంటారు.

సండే స్పెషల్

అవగాహన శిబిరాలు

సైబర్ నేరాలపై క్రైం ఫ్రీ ఇండియా బ్యానర్‌పై రాష్ట్ర వ్యాప్తంగా అనేక అవగాహన శిబిరాలు నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పలు కాలేజీల్లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు సైకిల్ ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ఫిషింగ్ మెయిల్స్, ఫేక్ మెయిల్స్‌తో జరిగే మోసాలపైనా వీడియోలు రూపొందించారు. ఫేక్ మెయిల్స్ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే మెయిల్ హ్యాక్ అవుతుందని ఆయన హెచ్చరిస్తున్నారు. సైబర్ నేరస్తులు పంపించే మెసేజ్‌లను నమ్మి మోసపోవద్దని గడ్డం మల్లేశ్ సూచిస్తున్నారు.

150కి పైగా వీడియోలు..

సైబర్ నేరాలకు పాల్పడే వారు ఎలా వ్యవహరిస్తారన్న దానిపై సుశీల, మల్లేశ్ దంపతులు ఇప్పటివరకు 150 కి పైగా వీడియోలు రూపొందించారు. వాట్సాప్, షేర్‌చాట్, ఇన్‌స్టా వంటి సామాజిక మాధ్యమాలకు 'అన్ నోన్ నంబర్'ల నుంచి వచ్చే మెసేజ్‌లతో ఏ రకంగా మోసపోతారన్న దానిపై రూపొందించిన వీడియో ఎంతో మందిని కదిలించింది. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించింది. హనీట్రాప్, డీప్ ఫేక్ వీడియోలతో జరిగే మోసాల విషయంలో ఎలా జాగ్రత్తగా వ్యవహరించాలన్న దాని గురించి వీడియోలలో వివరించారు. సైబర్ నేరాల తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వాటిని ఎలా అధిగమించాలన్న దానిపై వీడియోలు రూపొందిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



అప్రమత్తం చేయడానికి..

"సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో వస్తూ జనాన్ని ట్రాప్‌లో పడేస్తున్నారు. చాలా మంది చదువుకున్న వారే మోసపోతున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగాం, మెయిల్స్ వంటి వాటిని సైబర్ నేరగాళ్లు వాడుతూ మోసం చేస్తున్నారు. సులువుగా డబ్బులు వస్తాయని చెబుతుండడంతో వారి మాయలో పడుతున్నారు. అలాంటి వాటి విషయంలో ప్రజలను అప్రమత్తం చేయడానికి మావంతు ప్రయత్నం చేస్తున్నాం. చాలా మంది నా వీడియోలు, ప్రసంగాలు విని జాగరూకులవుతున్నారు.

– గడ్డం మల్లేశ్, సీఐ



మద్నూర్‌లో చలిమంట వేసుకుంటున్న ప్రజలు

వణికిస్తున్న చలి

- దోంగ్లీలో 6.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు
- జిల్లా అంతటా పడిపోయిన ఉష్ణోగ్రతలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : చలి పులి పంజా విసురుతోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి పడిపోయాయి. జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పడిపోవడంతో జనం వణుకుతున్నారు. రెండు మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 5 గంటలకే చలి తీవ్రత ప్రారంభమవుతోంది. ఉదయం 9 గంటల వరకు చలి తీవ్రత కొనసాగుతోంది. డోంగ్లీ మండల కేంద్రంలో శనివారం కనిష్ట ఉష్ణోగ్రత 6.8 డిగ్రీలుగా నమోదైంది. జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల పది డిగ్రీలలోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

జిల్లాలో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు (డిగ్రీలలో)

గ్రామం	కనిష్టం						
మేనూర్	8.2	బిచ్కుంద	10.4	బీబీపేట	11.2	రామలక్ష్మణపల్లి	12.3
జుక్కల్	9.6	లింగంపేట	10.5	సోమూర్	11.5	పెద్దకొడప్‌గల్	12.5
గాంధారి	9.9	మాచాపూర్	10.6	మక్దుంపూర్	11.8	కొల్లూర్	13.4
ఇసాయిపేట	10.2	హసన్‌పల్లి	10.7	బొమ్మదేవ్‌పల్లి	11.8	ఆర్గొండ	14.0
లచ్చాపేట	10.3	సర్వాపూర్	10.9	పిట్లం	11.8	భిక్కనూరు	14.1
నస్రుల్లాబాద్	10.3	బీర్కూర్	10.9	దోమకొండ	11.9	సదాశివనగర్	14.6
పుల్కల్	10.4	ఎల్పుగొండ	10.9	పాతరాజంపేట	12.1	తాడ్వాయి	15.3
		నాగిరెడ్డిపేట	11.0	రామారెడ్డి	12.1	కామారెడ్డి	17.4

ఘనంగా లూయిస్ బ్రెయిలీ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: అంధుల కోసం ప్రత్యేక లిపిని రూపొందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తి లూయిస్ బ్రెయిలీ అని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతను అందిస్తుందన్నారు. అంధులు తమ ఓటు హక్కును వినియోగించుకోడానికి బ్రెయిలీ లిపిలో ప్రత్యేక బ్యాలెట్ పేపర్‌ను ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. దివ్యాంగులకు జిల్లాలో ప్రత్యేకంగా గ్రంథాలయం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో బ్రెయిలీ లిపిలో ప్రచురించిన క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, సీడీపీవో రోచిష్మ , దివ్యాంగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

7న బాన్సువాడకు మంత్రి జూపల్లి రాక



ఎక్సైజ్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ : జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ఈనెల 7న బాన్సువాడకు రానున్నారని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడలో నిర్మించిన ఎక్సైజ్ కార్యాలయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి జూపల్లి నూతన ఎక్సైజ్ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. రూ.52 కోట్లతో చేపట్టే అమృత్ 2.0 పథకం పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. మంత్రి పర్యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఆర్టీసీ డీఎం సరితాదేవి, ఎక్సైజ్ సీఐ యాదగిరిరెడ్డి తదితరులున్నారు.

నర్సింగ్ కళాశాల భవన నిర్మాణం పరిశీలన

నస్రుల్లాబాద్: మండలంలోని దుర్కి గ్రామ శివారులో నిర్మిస్తున్న బీఎస్సీ నర్సింగ్ కళాశాల భవనం పనులను ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి , వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకుడు పెర్క శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోండి

వీసీలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కామారెడ్డి క్రైం: రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. రోడ్డు భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు శనివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రమాణాలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థులతో కలిసి జిల్లా, మండల కేంద్రాల్లో రోడ్డు భద్రతపై అవగాహన కలిగించేందుకు భారీ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం 75 శాతం ప్రమాదాలు డ్రైవర్ల తప్పిదాలతోనే చోటు చేసుకుంటున్నాయన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించని వారి డ్రైవింగ్ లైసెన్స్‌లను రద్దు చేసి, భవిష్యత్తులో వారికి మళ్లీ లైసెన్స్ జారీ చేయడానికి అవకాశం లేకుండా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. గురుకులాల్లోని విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతపై తనిఖీలు నిర్వహించాలని సూచించారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలి

మంత్రి వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జిల్లా అధికారులతో మాట్లాడారు. రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు, రంగోళి, వ్యాస రచన పోటీలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో తెలంగాణ సాంస్కృతిక సారథుల ఆధ్వర్యంలో గ్రామాల్లో పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను అంబులెన్స్‌లో ఏ ఆస్పత్రికి తీసుకవెళ్లాలో తెలిపే విధంగా ఆస్పత్రుల వివరాల బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి ఆయా ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో అన్ని రకాల వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల వద్ద ట్రాఫిక్ రూల్స్ తెలిపే విధంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ నరసింహారెడ్డి, డీటీవో శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీఈవో రాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోచారం నీటి విడుదల ప్రారంభం



ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్న ఇరిగేషన్ ఎస్‌ఈ విద్యావతి, ఆర్డీవో ప్రభాకర్

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు పరిధిలో యాసంగి పంటల సాగు కోసం శనివారం ఇరిగేషన్ ఎస్‌ఈ విద్యావతి, ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు గేట్ల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రాజెక్టు గేట్లను ఎత్తి 150 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువలోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిబంధనల ప్రకారం ప్రాజెక్టు నీటిని ఈ యాసంగి సీజన్‌లో 'ఏ' జోన్‌కు కేటాయించామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1.595 టీఎంసీల నీరు నిల్వ ఉందని, ఆయకట్టు భూములకు ఐదు విడతలలో 1.520 టీఎంసీల నీటిని అందిస్తామని పేర్కొన్నారు. ప్రతి విడతలో 15 రోజుల పాటు నీటిని విడుదల చేస్తామని, పది రోజుల విరామం ఇస్తామని తెలిపారు. మొదటి విడతలో ఈనెల 18వ తేదీ వరకు నీటిని విడుదల చేస్తామన్నారు. పది రోజులు విరామం అనంతరం తిరిగి ఈనెల 29న రెండో విడత నీటి విడుదలను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. నీటిని ఆయకట్టు రైతులు పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితరెడ్డి, ఇరిగేషన్ డీఈఈ మల్లేశ్, డీఈఈ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారి రత్నం, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో ప్రభాకరచారి, ఏఈ అక్షయ్, తాండూర్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, నాయకులు రాంచందర్‌రెడ్డి, శ్రీరాంగౌడ్, లక్ష్మణ్, వెంకట్రాంరెడ్డి, నర్సింహారెడ్డి, వాసురెడ్డి, నాగేష్, పర్వతరావు, గోపాల్, ఫారూక్, గులాం తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి'



నిజాంసాగర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 26వ రోజు కొనసాగింది. ఉద్యోగులు మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా తరలివెళ్లి నిజాంసాగర్ చౌరస్తాలో మానవహారం చేపట్టారు. గంట పాటు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పంజాబ్, హర్యానా, సిక్కిం, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించారన్నారు. అక్కడ సాధ్యమైన క్రమబద్ధీకరణ తెలంగాణలో ఎందుకు కాదో సీఎం చెప్పాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలన్నారు. బీడీఎస్ఎఫ్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శులు ఆజాద్, విఠల్ సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ మహిళా అధ్యక్షురాలు వాసంతి, ప్రధాన కార్యదర్శి సంపత్, ప్రతినిధులు సంతోష్‌రెడ్డి, రాములు, వనజ, రమేష్, శ్రీవాణి, శైలజ, కాళిదాసు, వీణ, చిరంజీవి, కృష్ణ, శ్రీనివాస్, మాధవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చైనా మాంజాల విక్రయం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో చైనా మాంజాల విక్రయం గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతుంది. సంక్రాంతి పండుగకు గాలి పటాలను ఎగురవేసేందుకు ఈ దారాలకు బాగా డిమాండ్ ఉంది. దీంతో నిషేదం ఉన్నా వ్యాపారులు పట్టించుకోకుండా విక్రయాలు చేపడుతున్నారు. అధికారులు స్పందించి చైనా మాంజాలను విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఓపెన్ యూనివర్సిటీ పరీక్ష రుసుం చెల్లించాలి

కామారెడ్డి అర్బన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ బీఏ, బీఎస్సీ, బీకాం డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షలు మార్చి 1నుంచి 6వరకు, 3వ సెమిస్టర్ పరీక్షలు మార్చి 7నుంచి 13వరకు, ఒకటవ సెమిస్టర్ పరీక్షలు మార్చి 15 నుంచి 21వరకు నిర్వహించనున్నట్లు కామారెడ్డి అధ్యాయన కేంద్రం సమన్వయకర్త సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే వారు ఈనెల 31లోగా పరీక్ష రుసుం చెల్లించాలన్నారు.

ఓపెన్ డిగ్రీ విద్యార్థులు ఏబీసీ ఐడీ పొందాలి

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఏబీసీ (అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్) ఐడీ పొందాలని కామారెడ్డి అధ్యాయన కేంద్రం సమన్వయకర్త సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐడీ పొందని వారు ఉన్నత చదువుల ప్రవేశాలు పొందలేరని, అలాగే ఉద్యోగాలు పొందలేరని అన్నారు. ఐడీ నమోదు కోసం కామారెడ్డి ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాలలోని అధ్యాయన కేంద్రంలో గానీ, 9700982621ను సంప్రదించాలన్నారు.

ఎరువులను అందుబాటులో ఉంచాలి



బిచ్కుంద(జుక్కల్): రబీలో రైతులకు అన్ని రకాలు ఎరువులు అందుబాటులో ఉంచాలని, బయోమెట్రిక్ ద్వారానే ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. మండలంలోని పుల్కల్ సొసైటీలో ఎరువుల నిల్వలను శనివారం ఆయన తనిఖీ చేశారు. రైతులకు అందుతున్న సేవలు, రికార్డులు పరిశీలించారు. సంఘం చైర్మన్ బీంరెడ్డి పటేల్, ఏడీఏ ఇంద్రసేన, ఏవో కమల పాల్గొన్నారు.

పరీక్షలకు సన్నద్ధం కావాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు సన్నద్ధం కావాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శేఖ్ సలామ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి ప్రతిభను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఎంసెట్, నీట్, జేఈఈ ప్రవేశ పరీక్షలకు సంబందించిన ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యాపకులు దుర్గయ్య, శివ, రాజయ్య, నాగు, స్వామిగౌడ్, ధర్‌సింగ్, అంజమ్మ, శ్రీలత, వాణి, శ్రీకాంత్, అభినవ్, నాగయ్య పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక



కామారెడ్డి టౌన్: ఢిల్లీలో ఈనెల 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు జిల్లా కేంద్రంలోని ఆర్కే డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థి శ్రీకాంత్ ఎంపికయినట్లు కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఢిల్లీకి చేరుకున్న శ్రీకాంత్ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లో రిపోర్టు చేసినట్లు పేర్కొన్నారు. తమ కళాశాల విద్యార్థి ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఎన్‌సీసీ ఆఫీసర్ దినేష్‌కు కళాశాల ప్రిన్సిపల్ సైదయ్య, దత్తాద్రి, లెక్చరర్లు అభినందనలు తెలిపారు.

ప్రకృతి అందాల నెలవు

అరణ్య అర్బన్ పార్క్



పార్కులోకి వస్తున్న చిన్నారులు



అరణ్య అర్బన్ పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు





అటవీ ప్రాంతాన్ని ఆనుకుని 460 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అరణ్య అర్బన్ పార్కు ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. జిల్లా కేంద్రానికి సమీపంలో మాక్లూర్ మండలం చిన్నాపూర్ అటవీ ప్రాంతంలో ఉన్న ఈ అర్బన్ పార్కులో ఆరు కిలోమీటర్ల మేర వాకింగ్ ట్రాక్, వాచ్ టవర్, జిమ్ సాధన పరికరాలు, పిల్లల పార్క్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అటవీఅందాలను వీక్షిస్తూ ఆహ్లాదంగా గడిపేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో అరణ్య పార్కుకు వస్తున్నారు. ఆయా స్కూళ్ల నుంచి పిల్లలను పిక్నిక్‌కు తీసుకువస్తుండడంతో వారు ఉల్లాసంగా గడుపుతున్నారు. రాగి, మర్రి, వేప, అల్లనేరేడు, నల్లమద్ది, తెల్లమద్ది, వెదురు ఇలా అనేక రకాల 90వేల చెట్లను పెంచారు. అడవికి ప్లాంటేషన్ తోడుకావడంతో అరణ్య పార్కు పచ్చదనంతో కళకళలాడుతోంది. సోలార్ కెమెరాలను ఏర్పాటు చేశారు. కెమెరా ప్రదేశానికి ఎవరైనా రాగానే సైరన్ వస్తుంది. ఆ వెంటనే ఫారెస్ట్ అధికారులు తమ సెల్‌ఫోన్‌లలో అక్కడి పరిస్థితిని తెలుసుకుంటారు. అనేక మంది తమ కుటుంబ సభ్యులతో కలిసి అరణ్య పార్కు అందాలను వీక్షించేందుకు తరలివస్తున్నారు. ఇళ్లలో భోజనం తయారు చేసుకుని వచ్చి ఇక్కడే ఆరగిస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రకృతి ఒడిలో గడుపుతున్నారు. పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20 ఎంట్రీఫీజును ఫారెస్ట్ సిబ్బంది వసూలు చేస్తున్నారు. అలాగే ఫొటో షూట్‌లకు రూ.200 నుంచి రూ.వెయ్యి వరకు వసూలు చేస్తున్నారు. సందర్శకుల తాకిడి పెరిగిందని ఫారెస్ట్ అధికారులు తెలిపారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



వాచ్ టవర్ వద్ద భోజనాలు చేస్తున్న చిన్నారులు



పార్కులోని వాచ్ టవర్

చలేస్తుంది.. గోనె సంచులు కట్టుకున్నాం..

- సబ్ కలెక్టర్ కిరణ్మయికి దీనస్థితిని వివరించిన నస్రుల్లాబాద్ గిరిజన పాఠశాల విద్యార్థులు



విరిగిన తలుపులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్



నస్రుల్లాబాద్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): పాఠశాల తలుపులు విరిగిపోవడంతో చలేస్తుంది మేడం.. చలి తీవ్రతను తట్టుకోవడానికి తలుపులకు గోనెసంచులను కట్టుకున్నాం అంటూ విద్యార్థులు తమ దీన స్థితిని సబ్ కలెక్టర్ కిరణ్మయికి వివరించారు. నస్రుల్లాబాద్ గిరిజన గురుకుల బాలుర పాఠశాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులు తమ సమస్యలను ఆమెకు విన్నవించారు. ఒకే గదిలో చదవడం, పడుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థుల గోడును అర్థం చేసుకున్న ఆమె వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. కలెక్టర్ స్పందించి డార్మెట్రీకి అదే ప్రాంగణంలో ఉన్న యూత్ ట్రెనింగ్ సెంటర్ భవనంను ఉపయోగించుకోవాలని ఆర్‌సీవోను ఆదేశించినట్లు ఆమె తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ పోశెట్టి, అధికారులు అంజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



బాన్సువాడలో తపస్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ/దోమకొండ: బాన్సువాడలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) డైరీ, క్యాలెండర్‌ను సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులు తదితరులు ఉన్నారు. అలాగే బాన్సువాడ వ్యాయమశాలలో శనివారం ఇస్కాన్ నూతన సంవత్సరం క్యాలెండర్లను వ్యాయామశాల అధ్యక్షుడు గురువినయ్ ఆవిష్కరించారు. జిల్లా ఇన్‌చార్జి వెంకట్‌దాస్ ప్రభుజి, మోహన్‌రెడ్డి, సాయిలు, దేవేందర్, గంగాధర్ ఉన్నారు. దోమకొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ క్యాలెండర్లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి ఆవిష్కరించారు. సంఘ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి



రామారెడ్డి: యాసంగిలో ఆరుతడి పంటలపై రైతులు దృష్టిసారించాలని, పంట మార్పిడి వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఈవో రాకేష్ తెలిపారు. మండలకేంద్రంలో శనివారం ఆయన రైతులకు వరి పొలాల్లో వెదజల్లే విధానంపై, డ్రోన్ ద్వారా మందుల పిచ్చికారిపై అవగాహన కల్పించారు. వరి పొలాల్లో వెదజల్లే విధానాన్ని అవలంభించడం వల్ల పెట్టుబడి ఖర్చులు భారీగా తగ్గుతాయన్నారు.

సోలార్ ఫిల్టర్లతో గ్రహాల వీక్షణ



కామారెడ్డి అర్బన్: మండలంలోని చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు శనివారం సోలార్ ఫిల్టర్లతో ఆకాశంలోని సూర్యున్ని వీక్షించడంతో పాటు రాత్రి చంద్రుడు, వలయంలోని శుక్ర, అంగారక, బృహస్పతి గ్రహాలను వీక్షించారు. ఆకాశంలోని గ్రహాలను చూడడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. సైన్స్ ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. వారం పాటు గ్రహాలు కనిపిస్తాయని, ఆసక్తి గలవారు చూసి చక్కని అనుభూతి పొందవచ్చని అన్నారు. హెచ్‌ఎం సాయిరెడ్డి, ఉపాధ్యాయులు చక్రపాణి, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతతో ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టాలి



ఆస్పత్రి భవన నిర్మాణ పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ: ఆస్పత్రి నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలో నిర్మిస్తున్న 100 పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని, త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు నార్ల రవీందర్, ఖలేక్, ఎజాస్, రఘు, నర్సన్న, గడుమల లింగం తదితరులు ఉన్నారు.

నారు మడిలో..



నారు తీస్తున్న పురుష కూలీలు

నిజాంసాగర్: సాధారణంగా జిల్లాలో పొలం పనుల్లో మహిళలదే కీలక పా త్ర. ప్రధానంగా నాట్లు వారే వేస్తుంటారు. కానీ బీహార్ కూలీల రాకతో ప రిస్థితి మారిపోయింది. ఆ రాష్ట్రానికి చెందిన పురుష కూలీలు నాట్లు వే స్తున్నారు. శనివారం బాన్సువాడ- ఎల్లారెడ్డి రోడ్డు పక్కన నారుమడిలో మగ కూలీలను చూసి ఆ దారిలో వెళ్తున్నవారు ఆశ్చర్యపోతున్నారు.

ప్రభుత్వ కళాశాల తనిఖీ

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ, అధ్యాపకుల హాజరును పరిశీలించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బుద్ధి రాజ్, అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చెరువులో పడి వృద్ధురాలు మృతి



ఎంబడి నాగవ్వ (ఫైల్)

డిచ్‌పల్లి : మండలంలోని సుద్దపల్లికి చెందిన ఎంబడి నాగవ్వ (80)అనే వృద్ధురాలు 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న సాంపల్లి చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. జక్రాన్‌పల్లి మండలం సికింద్రాపూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తానని శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి నాగవ్వ బయల్దేరింది. ఆమె కుటుంబ సభ్యులు శనివారం ఉదయం బంధువులకు ఫోన్ చేయగా నాగవ్వ రాలేదని వారు బదులిచ్చారు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు పలు చోట్ల గాలించారు. శనివారం సాయంత్రం సుద్దపల్లి సమీపంలోని సాంపల్లి చెరువులో నాగవ్వ మృతదేహం లభించింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎడపల్లిలో కత్తిపోట్లు




గాయపడిన ప్రణయ్

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి కత్తిపోట్ల కలకలం రేగింది. మండల కేంద్రంలోని గైని ఏరియాలో ఇద్దరు యువకుల మధ్య ఉన్న పాతకక్షలు కత్తిపోట్లకు దారితీశాయి. తాగిన మత్తులో ప్రణయ్, ఆదిల్ అనే యువకులు ఎదురుపడడంతో ఒక్కరినొకరు దూషించుకున్నారు. పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆదిల్ కత్తితో ప్రణయ్‌పై దాడి చేశాడు. ఇరువురు యువకులు ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొండెం చెరువు తూము బోల్టు చోరీ

నిలిచిన సాగునీటి సరఫరా



చోరీకి గురైన తూము బోల్టు

మోపాల్: మండలంలోని మంచిప్ప కొండెం చెరువు తూము బోల్టు చోరీకి గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు 20 రోజుల క్రితం బోల్టును గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని రైతులు తెలిపారు. యాసంగి సీజన్ నాట్లు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో తూము కిందికి దిగిపోయి ఆయకట్టుకు సాగునీటి సరఫరా నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని నీటిపారుదలశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని, అధికారులు స్పందించి తూముకు బోల్టు బిగించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. ఇదేవిషయమై ఇరిగేషన్ ఏఈని సంప్రదించగా, తూము బోల్టును దుండగులు ఎత్తుకెళ్లిన విషయం వాస్తవమేనని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు.

ఆటోలో ఎక్కించుకుని.. నగదు లాక్కుని..


- వృద్ధుడిని దోచుకున్న దుండగులు.. నిందితుల పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హమాల్‌వాడికి చెందిన మాలోత్ సర్దార్(60)అనే వృద్ధుడిని ముగ్గురు వ్యక్తులు బలవంతంగా ఆటోలో ఎక్కించుకుని నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల 2వ తేదీన మాలోత్ సర్దార్(60) హమాల్‌వాడి నుంచి కంఠేశ్వర్ వరకు వెళ్లి అక్కడి నుంచి కామారెడ్డి వెళ్లేందుకు బస్సు కోసం ఎదురుచూస్తుండగా ఆటోలో ముగ్గురు వ్యక్తులు వచ్చి అతడిని బలవంతంగా ఆటోలో ఎక్కించారు. సర్దార్ వద్ద ఉన్న రూ.5500 నగదుతోపాటు సెల్‌ఫోన్‌ను లాక్కుని కంఠేశ్వర్ ప్రాంతంలో వదిలిపారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శుక్రవారం ముగ్గురిని గుర్బాబాది రోడ్డులో పట్టుకున్నారు. సయ్యద్ బషీర్, అబ్దుల్ ఖాదర్, షేక్ అలీం అనే ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. నాందెడ్ నుంచి బషీర్ నిజామాబాద్‌కు వచ్చి తన మిత్రులైన షేక్ అలీం, ఖాదర్‌తో కలిసి ఆటోలో తిరుగుతూ వృద్ధులు, అమాయకులను టార్గెట్ చేసి వారి వద్ద నుంచి బంగారం లేదా డబ్బులు గుంజుకోవాలని పథకం రచించాడు. ఇందులో భాగంగా మాలోత్ సర్దార్‌ను ఆటోలో ఎక్కించుకుని నగదు, సెల్‌ఫోన్ లాక్కున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

దూడ సజీవ దహనం

మాచారెడ్డి: పాల్వంచ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ నివాసపు గుడిసె దగ్ధమై ఆరు నెలల దూడ సజీవదహనమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కామటి రాజవ్వ అనే మహిళ గుడిసెలో నివాసం ఉంటోంది. గ్రామంలో ఉంటున్న తన కూతురి ఇంటికి వెళ్లే ముందు దూడను గుడిసెలో కట్టేసి వెళ్లింది. అర్ధరాత్రి దాటిన తరువాత ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకోవడంతో దూడ సజీవదహనమైంది.

కోడి పందేలు ఆడుతున్న 13 మంది అరెస్టు



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని దూదేకుల కాలనీలో కోడిపందేలు ఆడుతున్న 13 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం సాయంత్రం 4.30గంటలకు కోడిపందేలా స్థావరంపై దాడ చేశామన్నారు. 13మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కోడి కత్తులు, రూ.7380 నగదు, 11 సెల్‌ఫోన్‌లు, నాలుగు పందెం కోళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.

గౌతమ్‌నగర్‌లో చైన్‌స్నాచింగ్

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గౌతంనగర్‌కు చెందిన మహిళ మెడలో నుంచి దండుగులు బంగారు గొలుసు లాక్కెళ్లారు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. అనసూయ అనే మహిళ శనివారం తెల్లవారుజామున 5.15 గంటలకు ఇంటి పనులు చేస్తుండగా అటువైపుగా నడుచుకుంటూ వచ్చిన దుండగులు ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యారు. బాధితురాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, సీసీ పుటేజీని పరిశీలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

నడుమునొప్పి భరించలేక ఆత్మహత్య



రామస్వామి(ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన పొట్టివారి రామస్వామి(28) నడుమునొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రామస్వామి గత కొంత కాలంగా తీవ్ర నడుమునొప్పితో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆస్పత్రిలో చికిత్స చేయించుకోలేక శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య విజయ వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో రామస్వామి బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



బిచ్కుంద(జుక్కల్): అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను శుక్రవారం రాత్రి పోలీసులు, అధికారులు పట్టుకున్నారు. వేబిల్లులు లేకుండా పుల్కల్ మంజీర నది నుంచి ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్ తోపాటు చిన్నదేవాడలో నాలుగు, హజ్గుల్, ఖద్గాంలో రెండు ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారని గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి శాంతాపూర్, కందర్‌పల్లి నేషనల్ హైవే, పుల్కల్ వద్ద ట్రాక్టర్లను పట్టుకున్నారు.

జనరేటర్‌కు నిప్పు

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి గ్రామశివారులో ఉన్న శ్రీలక్ష్మి రెడీమిక్స్ కాంక్రీట్ కంపెనీలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి జనరేటర్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. గతంలో కూడా ఈ కంపెనీలోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి ఆపరేటింగ్ క్యాబిన్‌కు నిప్పంటించారన్నారు. కంపెనీ యజమాని వెనిగళ్ల వేణుమాధవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.